

# నిప్పు

## సి. సుజాత

గుండెల్లోనే అణగారిన ఓ అర్తనాదం, ఒక వేదన, ఒక బాధ, ఒక నిస్సహాయత... ఇంకా అజ్ఞానం... అమాయకత్వం, పేదరికం, ఆకలి, అవసరం... వీటన్నిటికీ రూపం వస్తే... ఈ వ్యాపార ప్రపంచంలో 'శరీరం' కూడా అమ్మకపు సరుకుగా పనికి వస్తే....శరీరం రంగు, ఎత్తు, లావు, సన్నం... నాణ్యతలయితే, కరిగిపోతున్న కొవ్వొత్తిలాగా... నూరు ముక్కలుగా రాలిపడ్డ గాజు పాత్రలాగా... కళ్ల ముందు ఓ స్త్రీ మూర్తి... ఆమె వేశ్య, వెలయాలు, వ్యభిచారిణి... ఎలాగైనా పిలవ్వచ్చు! కానీ ఈ శరీర వ్యాపారం వెనుక, అనేకానేక కన్నీటి సముద్రాలు...ఎన్నెన్నో కఠిన వాస్తవాలు... లక్ష కారణాలు.. స్త్రీ మూర్తి దాకా ఎందుకు? ఒక చిన్న పాప కూడా ఈ వ్యాపారానికి మినహాయింపు కాదు! ఆరేడేళ్ల పాల బుగ్గల పసిపాప కూడా ఈ అగ్నిలో సమిధే!

కన్నీటి సముద్రంలాగా మన కళ్ల ముందుకి వచ్చిన 'అమీనా', తోటి నేరస్థుల లైంగిక నేరాలకు బలైన కాలే షావలీ.. ప్రతి రోజూ పేపర్ల నిండా అత్యాచారాలు, హత్యలు, లైంగిక నేరాలు జరుగుతున్నా స్పందించని, బండబారిన మనుష్యుల మధ్యే ఈ పసి మొగ్గలు...

ఒక హాస్పిటల్‌లో ఒక రోజు చేసిన సర్వేలో లైంగిక వ్యాధులకు గురైన ఆడవాళ్లు **362** మంది ఇన్‌పేషంట్లుగా చేరితే అందులో **58** మంది మైనర్‌లే, ఏడేళ్లనుంచి **14** సంవత్సరాల లోపు వాళ్లే వున్నారు. ఒక్కో పాప కథ... మనసుని మండించే ఓ దావానలం.

రాయలసీమలో రాణీ అనే పాపను ఆరేళ్ల వయసులో అగంతకులు కిడ్నాప్ చేశారు. ఆ పాపకు ఇంకా ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లాయిలు ఉన్నారు. పోయిన పాప కోసం ఒక ఏడుపు ఏడ్చి ఊరుకున్నారు తల్లితండ్రులు. రాణీని కిడ్నాప్ చేసిన వాళ్లు ఆమెను బాంబేలో బ్రోకర్‌కు అమ్మేశారు. **15** ఏళ్ల వయసు వచ్చాక, రాణి అక్కడి నుంచి ఎలాగో తప్పించుకొని తల్లితండ్రులను వెతుక్కుంటూ వచ్చింది. ఆ పాపకు ఏ నేరం చేయకుండానే శిక్ష మటుకు పడింది. సమాజ భయంతో ఆ పసిదాన్ని ఇంట్లోకి రానివ్వ లేదు తల్లితండ్రులు. గత్యంతరం లేక ఆ అమ్మాయి హైద్రాబాద్ చేరి వృత్తి కొనసాగిస్తోంది. రోజుకో వంద రూపాయలు సంపాదించగలదట! ఈ మానని గాయాలకు మందెక్కడ నుంచి ??

**- రచయిత్రి**

యునిసెఫ్, ఆకాశవాణి సంయుక్తంగా నిర్వహించిన రైటర్స్ వర్క్‌షాప్ ఇటీవల విజయవాడలో జరిగింది. బెంగుళూరుకు చెందిన 'బృంద' అన్న సోషల్ వర్కర్, తను కలుసుకున్న ఒక 'యువతి' చెప్పిన సంఘటన గూర్చి ఆ వర్క్‌షాప్‌లో మాట్లాడింది. రోజుకు పదిమంది కష్టమర్లతో, వళ్లంతా జబ్బుతో నిలువునా దహించుకు పోతున్న 'వృత్తిలో వున్న ఆ అమ్మాయి' అనుభవమే ఈ కథ...!

రోడ్డుపైన వర్షం చినుకులు. ఒక్కో చినుక్కి బురద తుల్లి పడుతోంది. నల్లని లేసు పట్టీలున్న చెప్పులు వేసుకున్న తెల్లని కాళ్లు... సరిగ్గా నాలుగు అడుగులు వేసి మాయమైపోయాయి కుమారి కళ్ల ముందు. బురద చినుకులు పడకుండా కాస్త పైకెత్తి పట్టుకున్న జరీ అంచు, పచ్చని పట్టు పరికిణీ ... ఎర్రని పావడా చివర్లు చమక్ మంటూ మాయమైపోయాయి. లేచి ఆ నడిచి వెళ్లిపోయిన అమ్మాయి ఎలా వుందో చూడాలనిపించింది కుమారికి. లేవాలంటే బద్ధకం వేసింది. వర్షం పడుతూనే వుంది బురద చిందిస్తూ. రోడ్డు నిర్లక్ష్యంగా ఏం పట్టనట్లు అలాగే పడివుంది. రోడ్డు దిగువుగా ఉన్న గుడిసెలోంచి, కుమారి పడుకున్న మంచం మీద నుంచి. రోడ్డు మీద నడుస్తున్న ఎన్నో జతల కాళ్లు...పాంట్లు, లుంగీలు, చెప్పులు, బూట్లు.. కారు చక్రాలు.. రిక్షా టైర్లు... మురికి... మురికి... జీవితమే పెద్ద మురికి ఊబి. కుమారి నిట్టూర్చింది. ఎన్నెన్నో నడిచి వెళ్లిన పాదాలు. ఇప్పుడి వర్షం కడిగేసినట్లుగా ఏ గుర్తులూ వదలని, ఏ జాడలు మిగల్చని పాదాలు... నిముషాలు గంటల్లా అనిపించే రాత్రులు ఎప్పటికో... ఎంతసేపటికో గడిచాక... తెల్లారే రాత్రుల తర్వాత వచ్చే బద్ధకపు పగుళ్ళు... కుమారి పడుకొని అలా చూస్తూనే వుంది!

విరిగిపడిన గోడ పట్టుకొని, దిగేందుకు మెట్లులాగా వేసిన రాళ్ళమీద బురదలో జారిపోకుండా జాగ్రత్తగా కిందికి దిగుతున్న రెండు కాళ్లు... లావుపాటి మొరటు పాదాలు. కాస్త పైగా వెండి పట్టీలు...ఆకుపచ్చ చీరె, పూసల గొలుసు.. మోచేతులు దిగిన జాకెట్టు.. నోట్లో తాంబూలం. బండ ముక్కు... నల్లటి కాటుక కళ్లు, నున్నగా దువ్విన తల... వర్షపు తుంపర్లలో తడుస్తూ రాజ్యం...

"కుమారీ...సినిమాకు వస్తావే..."

మంచం మీద దొర్లుతూ "అబ్బ... రాను" బద్ధకంగా అంది కుమారి.

"అబ్బ... రా ... పోదారి... ఆడు అప్పిగాడు..పోరు పెడుతూ వున్నాడు. వర్షానికి స్టూడెంటు కుర్రాళ్లు... గుంపులుగానంట. పొద్దుటాల నుంచి బంద్ కాబట్టి కాలేజి సెలవలంట... ఆలు నిండా ఆళ్ళే... ఎళ్ళమని టిక్కెట్లు దెబ్బినాడే..."

కుమారి తిట్టుకుంటూ లేచింది.

"ఈ అప్పిగాడు కూలిపడ... ఈడెంత ఆశాపాత్రుడో... రాత్రి ముగ్గురు పాసింజర్లు.. తల్లార్లూ ఆడు గుమ్మంకాడే సచ్చాడు. సూశావా పొద్దుట్నే తయారైనాడు..."

ఏదో చెప్పబోయి ఆగిపోయింది రాజ్యం.

అప్పారావు కుంటి కాలు ఎగరేసుకొంటూ టీఫ్లాస్కు తీసుకొచ్చాడు. పల్చటి తెల్లచొక్కా... వాన నీటికి వంటికి అతుక్కుపోయింది.

"ఏందే వెళ్లటం లేదా... టిక్కెట్లు దెబ్బినా..."

రెండు టిక్కెట్లు కుమారి చేతిలో పెట్టాడు అప్పారావు...

"రాజ్యం నీ కాడ వున్నాయిగా..."

రాజ్యం తలవూపింది.

****

సినిమా హాలు అంతా చిత్తడిగా వుంది. చిన్న చిన్న నీలం పూవులున్న తెల్ల చీరె కట్టుకొని, మాచింగ్ జాకెట్టు, చేతికి వాచి, నీలం రిబ్బన్ ముడేసిన పోనీ కట్టుకొని వర్షంలో విలాసంగా నిలబడి ఉంది కుమారి. చుట్టు చల్లని గాలి వీస్తున్నా, చిరు చలిగా వున్నా... వళ్ళు ఆవిర్లు వస్తున్నట్లుగా ఉంది కుమారికి. తొడల దగ్గర నుంచి లోపలికి దురద పెట్టేస్తోంది. కాసేపు నటన చాలించి సిగ్గు వదిలేసి బరబరా గోక్కోవాలని ఉంది కుమారికి. లోలోపల భగ్గుమని లేస్తున్న మంటని నీళ్ళతో కడుక్కుంటూ వుండి పోవాలని వుంది. 'ఇదేం జబ్బమ్మా... ఇలా పట్టుకొందీ....'

**...జస్ట్ మీరు కోఆపరేట్ చేయండి. మీరు నేర్చుకోండి. మీ ఆరోగ్యం కాపాడుకోండి. మనిషి పరిపూర్ణమైన జీవితం గడపాలి. ఇలాటి వృత్తిలో రోగాలబారిన పడి అర్ధాంతపు చావులు చచ్చిపోకూడదు...'**

పక్కనే స్కూటర్ ఆగింది.

కుమారి పెదవుల మీదకు సన్నటి నవ్వు వచ్చేసింది. ప్రొఫెషనల్ 'స్మైల్'. తన సన్నని నడుము చుట్టు, ఎత్తయిన రొమ్ము చుట్టూ, వర్షంలో తడుస్తున్న తన శరీరం చుట్టూ తిరుగుతున్న అతని చూపులను క్షణంలో పసిగట్టింది కుమారి. 'చేప పడింది'

"ఏందీ టిక్కెట్టు దొరకలేదా?" స్కూటర్ మీద నుంచి దిగుతూ అన్నాడతను.

అబ్బో పై షోకే గానీ... నోరు తెరిస్తే అయ్య బండారం... అని నవ్వుకొంటూ.

ఫ్రెండ్స్ వస్తానంటే బుక్ చేయించా... ఆమె రాలేదు... చూస్తున్నా...!

"పోనీ నాకు ఇచ్చేత్తా రేటీ...!"

కుమారి తటపటాయిస్తున్నట్లు చూసింది. అతని పల్లెటూరి తరహా దుస్తులు, జేబులోంచి కనిపించే నోట్లు...

"సరే రెండూ తీసుకోండి"

"అయ్యో మీరు..."

"ఇంక నేనేం వెళ్తాను లెండి..."

"సర్దాగా రండి... కాసేపు కూకుని పోదురుగాని..."

కుమారి నవ్వేసింది.

సినిమా హాల్లో ఇంకో అంతర్నాటకం. కుమారికి ఉన్నట్లుండి లెక్చరర్ తండ్రి, కలక్టరాఫీసు క్లర్కు తల్లి... బిజీ బతుకు... కబుర్లలోనే ఆవిష్కరణ అయింది. పైగా తల్లిదండ్రీ ఏదో ఊరు వెళ్ళిపోవటం, తను ఒక్కత్తే ఇంట్లో బోర్‌గా ఉండిపోవటం అతనికీ బోలెడంత నచ్చింది. ఇన్ని కబుర్ల తర్వాత, స్కూటర్ కుమారితో మూడు నక్షత్రాల హోటల్ వైపు విజయవంతంగా బయలు దేరింది. కుమారికి తొడల మధ్య ఆవిర్లు, దురదలు... పళ్లు కొరుక్కుంటూ 'పోనీ వెధవని...' అనుకొంది కుమారి. వర్షం కురుస్తూనే వుంది. వర్షం చినుక్కి చింది పడుతూ లేస్తూ బురద. చుట్టూ బురద. తెల్లారుతూ ఉండగా... ఆ రోడ్డు మీద నడిచి, గట్టు దిగి, గుడిసెలో అడుగు పెట్టిన కుమారి కాళ్ళ చుట్టూ బురదే...

****

"కుమారీ... వుసే కుమారీ... ఇట్టారావే.. ఈళ్ళెవుళ్ళో సూడే..." పక్షవాతంతో కాలు పడిపోయిన సొట్ట శాంత అరుస్తోంది. వైరుతో అల్లుతున్న కుర్చీని ఆధారంగా చేసుకొని లేచి నిలబడింది. కుమారి గుడిసె ముందుకు వచ్చింది.

రోడ్డు పక్కని కాలువ వద్దుని, పల్లంలోకి దిగువుగా... ఒకదాని కింద ఒకటిగా వేసిన గుడిసెలవి. ఎదురుగ్గా రోడ్డు, దిగువుగా కాలువ... గట్టు పొడువునా అడ్డదిడ్డంగా ఇళ్లు. ఆ గుడిసెల్లోకి రావాలంటే రోడ్డు పొడవునా కట్టిన ఎత్తయిన గోడకి అక్కడక్కడ చేసిన కంతల్లోంచి దూరి రావాలి. అక్కడక్కడ రెండుగోడల వెడల్పున పడదోస్తే ఏర్పడిన దారిలోంచి దిగిరావాలి. అల్లా గోడ దర్వాజ ఏర్పడ్డ ప్రతి చోట మగాళ్ళ కాపలా. లోపలికి ఎవడైనా రావాలంటే వాళ్ళ ప్రశ్నలకీ, ఆళ్ళ బలానికి చెప్పి రావాల్సిందే. వృత్తిలో ఉన్న ఆడవాళ్ళుండే ఆ యమ కూపానికి కాపలా భటుల్లా వాళ్ళ మీద బతికే దళారుల గుంపులు వచ్చిన వాళ్ళతో ఘర్షణ పడుతున్నారు.

కుమారి రోడ్డు గోడ దగ్గరకు వచ్చింది.

"ఏంది తాతా..." అంది ఫకీరయ్యను

"ఈళ్ళేవో.. లోపల ఆడాళ్ళకి సినేమా సూపిత్తారంటనే. మాకొద్దు పొమ్మంటుంటే ఇనరేందీ..." ఆశ్చర్య పడ్డాడు ఫకీరయ్య. వచ్చిన వాళ్ళలో తెల్లషర్టు నల్లపేంటులో టక్‌చేసుకొన్న అతను ముందుకి వచ్చాడు

"చూడండమ్మా.. మేం సత్యసదన్ సేవానిలయం" నుంచి వచ్చాం. ఇక్కడ హెల్త్ ఎవేర్‌నెస్ క్యాంప్ పెట్టాలనుకొన్నాం. రేపుపొద్దున ఫుడ్ అండ్ న్యూట్రిషన్ క్లాసులు. వినేందుకు వచ్చే వాళ్ళకి 30 రూపాయలు ఇస్తాం".

'మేం సూత్తానికి మీరు డబ్బులెందుకు ఇస్తారు....' సొట్ట శాంతకి అనుమానం వచ్చింది.

తెల్ల చొక్కా అతను పక్కనున్న ఇంకో అతని వైపు నిస్సహాయంగా చూచాడు. అతను ముందుకు వచ్చాడు.

'చూడమ్మా మేం మురికివాడల ప్రజల సంక్షేమం, ఆరోగ్యం గురించి ప్రచార కార్యక్రమం కోసం వచ్చాం. ఇవన్నీ మీకు తెలియజెప్పటం, మా ఆర్గనైజేషన్ ప్రోగ్రామ్‌లో ఒక భాగం. ఇందుకు గాను మా సంస్థ కొంత డబ్బు ఖర్చు చేస్తుంది. మీరు సాయంత్రం ఓ పది మంది ఎక్కడైనా వీలుగా కలిసి కూర్చునే చోటు చూడండి. మా డాక్టరుగారు వస్తారు. జబ్బులు ఉంటే పరీక్షలు చేసి మందులు ఇస్తారు. మీరు ఇష్టమయితే మా సంస్థ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవచ్చు. మంచి ఆహారం ఎల్లా తయారుచేసుకోవాలో, తక్కువ ఖర్చుతో శక్తినిచ్చే పదార్థాలు ఎలా వండాలో, మా ప్రోగ్రామ్ ఆఫీసర్‌గారు చెప్తారు. జస్ట్ మీరు కోఆపరేట్ చేయండి. మీరు నేర్చుకోండి. మీ ఆరోగ్యం కాపాడుకోండి. మనిషి పరిపూర్ణమైన జీవితం గడపాలి. ఇలాటి వృత్తిలో రోగాలబారిన పడి అర్ధాంతపు చావులు చచ్చిపోకూడదు...'

అంత ఆవేశంతో చెప్పేక, కళ్ళనీళ్లు వచ్చాయతనికి.

నిర్మలంగా ఉన్న అతని కళ్ళనీ, అభిమానంతో పలికిన అతని గొంతునీ నిశ్శబ్దంగా పరికించింది

కుమారి. ఎడారిలో వర్షం చినుకులు వడ్డట్లుగా ఉందామెకు. ఆమెను చూసి కళ్ళెగరేయకుండా, వంకరగా నవ్వకుండా అమ్మా అని పిలిచింది అతనొక్కడే. పది రోజుల క్రితం యమ బాధ పడి పోగొట్టుకున్న తన కడుపు గుర్తొచ్చింది.

'ఏందే అప్పుడే కాలుచేయీ ఆకారం ఏర్పడిందే కుమారి నీ బిడ్డకీ' అని సొట్ట శాంత చెపితే కుమారి కళ్ళు తడిశాయి.

'తనను అమ్మా అని పిలిచే ఇల్లాంటి కొడుకుంటే...' పరుపు కుడుతున్న మస్తానయ్య వైపు చూసింది కుమారి. పోన్లే అన్నట్లు తలెగరేశాడతను.

"ఆడ సివర పడిపోయిన గోడ దగ్గరనుంచి లోపలకి రండి బాబూ...

అక్కడ ఇశాలంగా ఉందిసోటు. మస్తానమ్మ ఇంటికాడ.. సౌకర్యంగా ఉంది. ఆడయితే దిగువన పది కుటుంబాలున్నాయి..."

తెల్ల చొక్కా అబ్బాయి తలవూపాడు. అన్నింటికీ వప్పుకోవటం చాలా నచ్చింది. రెండు చేతులు జోడించి నమస్కారం చేసింది.

"ఒకే రేపే క్యాంప్ పది గంటలకల్లా వస్తే అల్లా చివర ఇల్లేనన్నావు గదా డాక్టరుగారు అక్కడికే వస్తారు..."

కుమారి కాళ్ళమధ్య వెచ్చని వేడి .. భరించలేని దురద...

'డాక్టరమ్మతో అంతా చెప్పుకొంటా' మనసుకేదో ధైర్యం వచ్చింది.

"నిజమే.. ప్రపంచంనిండా దుర్మార్గులే ఉంటే... లోకం ఇట్లా గుంటుందా... ఉప్పెన ముంచెయ్యదూ... ఇల్లాంటోళ్ళు ఉండమట్టే..." సొట్ట శాంతి స్వగతం పలుకుతోంది.

****

కుమారి మనస్సంతా ఉద్వేగంతో పొంగుతున్నట్లుగా వుంది. డాక్టరమ్మ తీరికగా కుమారితో మాట్లాడింది. ఆ అమ్మాయికి ఏం జబ్బు అంటుకుందో. అదెలావచ్చిందో. ఇప్పుడెలాటి మందులు తీసుకోవాలో. ముందుగా ఈ వృత్తినుంచి ఎంత తొందరగా బయటపడాలో వివరంగా చెప్పింది. ఈ వృత్తి చేసేవాళ్ళు జబ్బుల వల్ల ఎంత త్వరగా చచ్చిపోతారో చెప్పింది. ఆమె మాట, తీరు ఆమె చూపిన దయ... కుమారి జీవితంలో మొదటిసారిగా అంత సానుభూతిని పొందింది. ఈ రోడ్డు పక్క గుడిసెలు, దిగువన పారేమురికి కాలువ... చుట్టు బురద, తమ బతుకు.. తినే తిండికోసం, బట్టకోసం, పూసల గొలుసు కోసం, గిల్టు నగల కోసం.. తమని తాము కరిగించుకుంటున్న వైనం, డాక్టరమ్మ చెపితేనే అర్థం అయింది. ఈ వృత్తి, ఈ వృత్తి చుట్టూ బాధలు, వృత్తి మీద ఆధారపడ్డ అప్పిగాడి వంటి బ్రోకర్లు, ఈ వృత్తిని తమ స్వలాభం కోసం బతికించి ఉంచే దళారీలు... తమ శరీరాల పైన లక్షలార్జించే మూస నక్షత్ర హోటళ్లు.. బ్రోకర్లు, పాసింజర్లు, మానవ మృగాలు. కుమారి మనసు కరిగి కళ్ళలోంచి ప్రవహించింది. వృత్తిలో ఉండే అన్యాయం, జబ్బుల పాలైపోతున్న ఆడవాళ్ళ జీవితాలు, వాళ్ళ దయనీయమైన చివరి రోజులు, 30 ఏళ్ళకే ముగిసి పోయిన వాళ్ళ యవ్వనపు దినాలు... రోడ్డు పక్కన కుళ్ళిపోతూ చావుకు సిద్ధమౌతున్న తనకు తెలిసిన పెద్దవాళ్ళు. అంతా కుమారి కళ్ళముందు సినిమా రీళ్ళులాగా తిరిగాయి. తెల్లని నీరెండ మీద రాత్రి నల్లని చీరె పరచిన సంగతి కూడా గమనించలేనంత మైకంలో ఉంది కుమారి. నల్లని మబ్బుల మధ్య తళుక్కుమని మెరుపులు మెరుస్తున్నాయి. నల్ల చిన్న పాపాయిలు, వాళ్ళ బోసినవ్వులు... అక్కడి నుంచి, ఎత్తయిన ఇళ్ళ మీదనుంచి ఊరి బయటకు చేరుతున్న మురుగు కాలువలు, తీరైన దారి లేని బుల్లి బుల్లి గుడిసెలు, బాన పొట్టలతో ఏడ్చే పాపాయిలు, కూలి పనిచేసే వాళ్ళు, రిక్షా కార్మికులు వాళ్ళందరి మధ్య ... రాత్రి వేళ స్థంబాల చాటున నిలబడ్డ తెల్ల చేరెల, మల్లె పూవుల పొదరు పూతల శవాలు.

కుమారి కళ్ళలోంచి నెత్తురు చుక్కలు రాలిపడుతున్నాయి. ఈ జీవితం వద్దుగాక వద్దు. ఈ జబ్బుల జీవితం, ఈ పోలీస్ కేసుల జీవితం. ఈ వళ్ళమ్ము కొనే జీవితం... పదిమందికి కొంగుపరిచే ఈ బతుకు వద్దే వద్దు....

కుమారి ఉలిక్కిపడింది.

ఒక స్పర్శ... అలవాటైన కోరిక స్పర్శ... రోజుకి పదిసార్లు గొంగళి పురుగులా తన వంటి మీద పాకే కాంక్ష తాలూకా స్పర్శ- ఒక మగ పురుగ వాసన...

కుమారి బిత్తర పోయింది. ఆ స్పర్శ నెత్తి మీద నుంచి, జుత్తు నిమురూ్తా, వెన్ను నిమురూ్తా, మెడ చుట్టు రాస్తూ, కాస్త కిందికి దిగి రొమ్ములను తడుముతూ ...

ఇక్కడెవరు ?

కుమారి ఆశ్చర్యంగా తల పక్కకి తిప్పింది. తెల్ల చొక్కా అబ్బాయి... తన గుండెల్లోంచి అమ్మ దనాన్ని తట్టి లేపిన, జాలి జాలి చూపుల బాబు. ఇలాటి దయగల కొడుకు వుంటే... అమ్మ వేదన... అమ్మ మనసు కనిపెట్ట గలిగిన ఇలాటి ఒక్క కొడుకుంటే, ఈ నరకాన్నీ నవ్వుతూ దాటనా అనిపించి తన గుండెని పాలతో పొంగించిన ఆ లేత కుర్రాడు....

ఆపు...

కుమారి వెర్రి కేక పెట్టింది.

> **కుమారి కళ్ళలోంచి నెత్తురు చుక్కలు రాలిపడుతున్నాయి. ఈ జీవితం వద్దుగాక వద్దు. ఈ జబ్బుల జీవితం, ఈ పోలీస్ కేసుల జీవితం. ఈ వళ్ళమ్ము కొనే జీవితం... పదిమందికి కొంగుపరిచే ఈ బతుకు వద్దే వద్దు....**

ప్యాంటు తెల్ల చొక్కా కుర్రాడు రెండు గుడిసెలకు కలసి తెల్ల కర్టెన్ వేలాడదీ శాడు. సినిమా మొదలైంది. అందమైన పచ్చని తోటలో ఎర్రెర్రని పూవులు, మంచి పళ్లు... పారే నదులు, గాలికి స్వేచ్ఛగా ఊగే చెట్ల కొమ్మలు. దట్టమైన అడవులు, నీడల్లో కాలిబాటలు, చల్లని చెరువులు, గుండ్రంగా అరిగిన తెల్లతెల్లని రాళ్ళు, మెత్తటి ఇసుక చలువ పందిళ్ళ వంటి ఇల్లు... పొందికైన ఆ ఇళ్ళల్లో కుదురైన చిన్న సంసారాలు... చిన్న

సినిమా ఆగింది. లైటు వెలిగింది. కుమారి గజగజ వణికిపోతుంది. రెండు కాళ్ళ మధ్యనుంచి, భగ్గున మంట లేచింది.

"ఏందే పాపా..., ఏందే సెల్లా... కుమారీ... ఏందే అమ్మా" చీకట్లో పదిగొంతులు కంగారుగా అడుగుతున్నాయి.

రంగు రంగుల కలల్లోంచి బయటపడి, ఇంకా బయటకు రాలేని ఆరాటంతో కుమారి వణికిపోతోంది.

ప్రొజెక్టర్‌ని కాలితో ఒక్క తన్ను తన్నింది కుమారి. అందరి మధ్య తెల్ల చొక్కా కుర్రాడు తలవంచి నిలబడ్డాడు. ఉన్నట్లుండి ధైర్యం వచ్చినట్లుంది.

"ఏ వెందుకూ.. ఇదినీకు కొత్తా ఏంటీ... ఏంటీ పేద్ద అరుస్తున్నావ్...."

పట్టలేని ఆవేశంతో అతని చెంప ఛెళ్ళున మోగించింది కుమారి.

"ఒక్క నిముషంలో ఇక్కడి నించి పోకపోతే, నా చేతిలో చస్తావ్"

అతని వైపు అసహ్యంగా చూసింది. సందడి లోంచి అప్పారావు నవ్వు తెచ్చుకొంటూ లేచాడు.

"పోనియ్యే కుమారీ.. ఆ బాబుకి సరసాలాడ బుద్దేసిందేవో..."

పట్టరాని కోపంతో అప్పారావుని ఒక్క తోపు తోసింది కుమారి. అప్పారావు ఒక్కవూపుకి వెళ్ళి తెరచించుకుంటూ అవతల పడిపోయాడు. కుమారి చుట్టూ చూసింది నిస్సహాయంగా. ఎక్కడో గొంతులోంచి, కడుపు లోంచి పెగుల్చుకుంటూ వచ్చిందో ఆర్తనాదం.. ఒక్క విసురులో నాలుగు అంగల్లో గుడిసెలో పడింది. ఎదురుగా నిలువుటద్దం.. అద్దం ముందు పవుడర్లు... సెంట్లు, మల్లెపూలు. రాత్రి వేషం కోసం అప్పారావు అన్నీ సిద్ధంగా ఉంచాడు.

"అప్పిగా..."

అతను వచ్చేలోగానే ఇంకో కేకపెట్టింది కుమారి. అప్పారావు వచ్చాడు. "రేతిరికి పదిమందికి తగ్గకుండా పాసింజర్లు రావాల. కళ్ళు మూసేవో నా సేతిలో సచ్చేవే. ఇదిగో 30 ఏళ్ళకే సస్తానని డాక్టరమ్మ చెప్పిందిగా. ఇదిగో నే సచ్చేలోగా ఈ ఊర్లో కొడుకులందరికీ నా జబ్బు అంటాల...."